సాక్షి
కర్నూలు
ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై శనివారం హైదరాబాద్‌కు చెందిన సాయి నటరాజ అకాడమీ కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



భ్రామరీకి లక్ష కుంకుమార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శనివారం పౌర్ణమి సందర్భంగా లక్షకుంకుమార్చన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు పరోక్ష సేవగా పాల్గొనే అవకాశం కల్పించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,629.19
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 91.051
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 3,419
అవుట్ ఫ్లో	: 5,828

న్యూస్‌రీల్

రాజగోపురానికి రూ.లక్ష విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద క్షేత్రం రాజగోపుర నిర్మాణానికి శనివారం గుడికల్లుకు చెందిన బోయ ఉలిగయ్యగారి నారాయణ, కవిత రూ.1,01,120 విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, బాండు అందజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులు విరివిగా విరాళాలు అందజేయాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఆరుగురు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 96 శాతం, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో 91 శాతం హాజరు నమోదైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరగగా మొదటి సెమిస్టర్‌కు 3,156 మందికి 3,039 మంది విద్యార్థులు హాజరు కాగా 117 మంది, మూడు, ఐదో సెమిస్టర్‌కు 9,766 మందికి 8,874 మంది హాజరు కాగా 892 మంది గైర్హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నంద్యాల పీఎస్‌సీ, కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో ముగ్గురు, కర్నూలు డిగ్రీ కళాశాల, ఆలూరు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల, ఎమ్మిగనూరు రావూస్ డిగ్రీ కళాశాల కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఆరుగురు విద్యార్థులు చూచిరాతకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

వక్ఫ్ స్థలంలో అక్రమ నిర్మాణాల నిలుపుదల

కర్నూలు(అర్బన్): నగరంలోని సర్వే నెంబర్ 62లోని అబ్దుల్ వహాబ్ ఖాన్ టోంబోకు చెందిన వక్ఫ్ స్థలాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలుపుదల చేయించామని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సయ్యద్ సబీహా పర్వీన్ తెలిపారు. వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ సయ్యద్ సుహైల్, వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం కన్వీనర్ సయ్యద్ మహ్మద్ పీర్‌తో కలిసి శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి శనివారం తెల్లవారుజామున 3 గంటల వరకు అక్కడే ఉండి రెవెన్యూ, పోలీస్ శాఖ సహకారంతో అక్రమ నిర్మాణాలను నిలిపివేయడం జరిగిందన్నారు. ఈ నిర్మాణాలకు సంబంధించి గతంలో రెండు పర్యాయాలు హెచ్చరికలు జారీ చేసినా నిర్మాణాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే జరుగుతున్న అక్రమ నిర్మాణాల గురించి ఉన్నతాధికారులకు సమాచారాన్ని చేరవేశామన్నారు. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇచ్చి అక్రమ నిర్మాణాలను నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు.

పల్లెల్లో నీటి కష్టాలు



పెద్దహ్యాటలో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

హొళగుంద: ఎల్లార్తి మంచినీటి పథకం సిబ్బంది వేతనాలు అందక విధులు బహిష్కరించడంతో ఏడు గ్రామాల ప్రజలు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. మూడు రోజులుగా సమ్మతగేరి, కోగిలతోట, ముగుమానుగుంది, ఎల్లార్తి, చిన్నహ్యాట, బీజీ హళ్లీ, పెద్దహ్యాట గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు అందుబాటులో ఉన్న బోరుబావులు, సంప్‌లను ఆశ్రయిస్తున్నారు. పెద్దహ్యాట పంచాయతీ అధికారులు ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఆ నీటిని కాలువ నుంచి నేరుగా తీసుకొస్తుండడం తాగడానికి రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఎల్లెల్సీతో పాటు మంచినీటి పథకంలో పుష్కలంగా నీరున్నా తాగునీటికి గుక్కెడు నీటికి నోచుకోలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు. మంచినీటి పథకానికి సంబంధించిన 8 మంది సిబ్బందికి 10 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వారు విధులకు గైర్హాజరవుతున్నారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నా వా టర్ స్కీం నిర్వహణ కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

ఔను.. మేమిద్దరమే!

- ఇద్దరూ సంపాదిద్దాం... కానీ పిల్లలు వద్దనే సంస్కృతి
- ఆ డబ్బుతో జీవితాన్ని ఆస్వాదిద్దాం
- కోరుకున్నచోటకు తిరిగి ఎంజాయ్ చేద్దాం
- కావాలనుకున్నప్పుడే పిల్లలను కందాం
- కర్నూలులో ప్రవేశించిన నయా కల్చర్ 'డింక్'





పూర్వం వయస్సు మీద పడుతున్నా పెళ్లికాకపోతే 'ఏమి ఇంకా పెళ్లి చేయలేదా'.. అనేవారు. పెళ్లయ్యాక 'ఏమి ఇంకా పిల్లలు కాలేదా' అని దెప్పిపొడిచేవారు. కానీ నేటి యువజంటల్లో కొందరు మాకు పిల్లలే వద్దని తెగేసి చెబుతున్నారు. పెళ్లి చేసుకుంటాం.. గానీ ఇప్పుడే పిల్లలను కనేది లేదని అంటున్నారు. 'చదువు, ఉద్యోగం పేరుతో ఇన్నాళ్లు కష్టపడుతూనే ఉన్నాం. కనీసం ఇప్పుడైనా ఎంజాయ్ చేస్తాం. మాకు కావాలనుకున్నప్పుడు మాత్రమే పిల్లలను కంటాం'అని భీష్మించుకుని కూర్చుంటున్నారు. ఒకప్పుడు హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలకు మాత్రమే ఉన్న ఈ సంస్కృతి ఇప్పుడిప్పుడే కర్నూలు నగరానికి కూడా పాకుతోంది.

– కర్నూలు(హాస్పిటల్)

సండే స్పెషల్

పెళ్లి చూపుల్లో అమ్మాయి, అబ్బాయి ఇష్టపడితే కట్నకానుకలు మాట్లాడుకోవడం ఒకప్పటి మాట. ఇప్పుడు కొన్ని షరతులు.. అంటూ కొత్త కొత్త అంశాలు పెద్దల ముందు ఉంచుతున్నారు. ముఖ్యంగా అమ్మాయి తరపు వాళ్లు తగ్గేదేల్యా.. అంటున్నారు. నిన్నటి వరకు 'ఇంట్లో అత్తామామలు, ఆడబిడ్డలు ఉండకూడదని.. ఇంటికి మాటిమాటికి చుట్టపు చూపుతో బంధువులు రాకూడదని... మా పిల్ల వారికి చాకిరి చేయలేద'ని తెగేసి చెప్పేవారు. కానీ ఇప్పుడు కొందరు 'అమ్మాయిని ఇస్తాము గానీ మా పిల్ల ఇంకా ఇప్పుడే చిన్నది...ఇప్పుడిప్పుడే పిల్లలను కనాలని ఇష్టం తనకు లేదని, ఈ అంగీకారానికి అబ్బాయి ఒప్పుకుంటేనే పెళ్లి అని చెబుతున్నారు. స్కూల్, ఇంటర్, డిగ్రీ/బీటెక్, ప్రొఫెషనల్ కోర్సులు చదువుతూ ఎలాంటి ఎంజాయ్ చేయలేదని, ఇప్పుడు పెళ్లి, ఆ తర్వాత పిల్లలు అంటే.. సరదాలు, సంతోషాలు ఇంకెప్పుడు అంటూ చెబుతున్నారు. ఈ అంగీకారమేదో బాగుందని ఒప్పుకుంటున్న మగరాయుళ్లూ ఉన్నారు. ఈ మేరకు ఇద్దరి అంగీకారంతో వివాహాలు హాయిగా జరిగిపోతున్నాయి. కానీ ఏ ఒక్కరూ పైకి ఈ విషయం బయటకు మాత్రం చెప్పడం లేదు. వివాహమయ్యాక వీకెండ్‌లో ఇద్దరూ హాయిగా విహారయాత్రల పేరిట ఎంజాయ్ చేస్తున్నారు. నచ్చినచోటకు వెళ్లడం, నచ్చినది తినడం, నచ్చిన ప్రదేశాలు చూడటం, ఇష్టమొచ్చిన హోటళ్లలో బస చేయడం వంటి సరదాలు తీర్చుకుంటున్నారు. ఇలాంటి సంస్కృతిని ఆంగ్లంలో 'డ్యూయల్ ఇంకమ్ నో కిడ్స్' (డింక్)గా పిలుస్తారు. ఈ లైఫ్‌స్టైల్‌లో భార్యాభర్తలిద్దరూ సంపాదించాలి...కానీ పిల్లలు మాత్రం వద్దు. ఆ ఇద్దరు సంపాదించిన డబ్బుతో ఎంజాయ్ చేస్తారు. వారి జీవితానికి వారే రాజు...వారే రాణి అన్నమాట. ఈ డింక్ లైఫ్‌స్టైల్ 1980 దశకంలో జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ప్రారంభమైందని చెబుతారు. గత దశాబ్ద కాలంగా మన దేశంలోని మెట్రో సిటిలైన న్యూఢిల్లీ, ముంబాయి, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కత లాంటి నగరాల్లో ప్రారంభమైంది. ఆయా ప్రాంతాల్లో ఉద్యోగాలకు వెళ్లిన మన ప్రాంత యువతీయువకులు డింక్ సంస్కృతికి అలవాటు పడుతున్నారు. ఈ కారణంగా ఈ సంస్కృతి ఇక్కడ కూడా ఇప్పుడిప్పుడే ప్రారంభమైందని చెప్పొచ్చు. డింక్ లైఫ్‌స్టైల్ గురించి సోషల్ మీడియాలో గొప్పగా ప్రచారం జరుగుతున్న తీరుతో కొందరు ఔత్సాహిక యువతీయువకులు అటువైపు మొగ్గుచూపుతున్నారు.

ఉద్యోగ భద్రత లేకపోవడం

మంచి కంపెనీలో ఉద్యోగంలో చేరినా వారికి ఇష్టం లేకపోయినా, కంపెనీకి వారి పని నచ్చకపోయినా ఉద్యోగం పోతుంది. ఆ తర్వాత ఇంకో ఉద్యోగం వెతుక్కోవాల్సి వస్తుంది. ఇటీవల కాలంలో చాలా మంది యువతీయువకులు ఒకే కంపెనీలో రెండు, మూడేళ్ల మించి పనిచేయడం లేదు. వారు మారడమో, కంపెనీలు ఉద్యోగం నుంచి తొలగించడమో చేయడం వల్ల వారు కంపెనీలు మారుతున్నారు. ఈ క్రమంలో వారికి ఉద్యోగ భద్రత లేకుండా పోతోంది. కొంత కాలం వేచి చూసి ఉద్యోగం వల్ల కావాల్సినంత కూడబెట్టుకున్నామని భరోసా కలిగాక పిల్లలు, వారి పెంపకం గురించి ఆలోచించే వారు ఎక్కువయ్యారు.

పిల్లలను పెంచడమూ భారంగా...!



కొందరు యువతీయువకులు పిల్లలను పెంచడాన్ని కూడా భారంగా భావిస్తున్నారు. మెట్రో సిటీల్లో వారిద్దరే ఉంటుండటంతో ఒకవేళ పిల్లలు కన్నా వారిని చూసుకోవడానికి ఎవ్వరూ ఉండరు. పిల్లలను కనేందుకు, వారిని పెంచేందుకు తరచూ సెలవులు పెట్టాల్సి రావడం, ఇందుకోసం భారీగా ఖర్చు పెట్టాల్సి ఉండటం నేటి కొందరు యువతీయువకులకు ఇష్టం ఉండటం లేదు. పిల్లలు పెద్దగైతే మెట్రో సిటీల్లో వారి చదువులు, వారిని పెంచేందుకు డబ్బులు విపరీతంగా ఖర్చు పెట్టాల్సి వస్తుందని భయపడుతున్నారు. కొంత కాలం భార్యాభర్తలిద్దరూ ఉద్యోగం చేసి సంపాదించి, కూడబెట్టి, ఎంజాయ్ చేసిన తర్వాత మాత్రమే పిల్లలను కనాలనే ఆలోచనతో ఉంటున్నారు. ఈ మేరకు కొందరు తల్లిదండ్రులకు కూడా తెలియకుండా భార్యాభర్తలిద్దరూ మాట్లాడుకుని పిల్లలను ఇప్పుడే వద్దనుకుంటున్నారు.

నచ్చిన జీవితాన్ని ఆనందించేందుకే...!

ఒకప్పుడు ప్రొఫెషనల్ కోర్సులు కేవలం ఉన్నత వర్గాల పిల్లలు మాత్రమే చదివేవారు. కానీ దివంగత సీఎం వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో ఏటా వేల సంఖ్యలో విద్యార్థులు పట్టాలు తీసుకుని బయటకు వస్తున్నారు. ఈ క్రమంలో ఉద్యోగ అవకాశాల కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబయి వంటి నగరాలకు వెళ్తున్నారు. ఆ క్రమంలోనే వారికి తగినట్లే మెట్రో సిటీల్లో ఉద్యోగం చేసేవారో, లేక ఉన్నత చదువులు చదివిన వారో ఎంచుకుంటున్నారు. ఇద్దరూ అక్కడే కలిసి ఉద్యోగాలు చేస్తూ సంపాదిస్తున్నారు. ప్రొఫెషనల్ కోర్సులు చదవాలంటే ఆషామాషీ కాదు. పాఠశాల, ఇంటర్, ప్రొఫెషనల్ కోర్సుల్లో ఎక్కడా టైమ్ వేస్ట్ చేయకుండా, విలాసాల జోలికి వెళ్లకుండా చదువుతూ ఉన్నత స్థానాలకు ఎదగాలి. ఈ క్రమంలో ఉద్యోగం వచ్చేంత వరకు వారి జీవితంలో ఎంజాయ్ అనే పదం చాలా తక్కువగా కనిపిస్తుంది. ఉద్యోగం సంపాదించాక కూడా ఎంజాయ్ లేకపోతే ఎలాగంటూ పిల్లల కనడాన్ని వాయిదా వేసుకుంటున్నారు.

'డింక్'తో దేశాభివృద్ధికి గొడ్డలిపెట్టు



చైనా వంటి దేశాల్లో యువత కంటే వృద్ధులే అధిక సంఖ్యలో ఉండటంతో అక్కడ అభివృద్ధి రేటు క్రమంగా క్షీణిస్తోంది. ఈ కారణంగా ఒకప్పుడు పిల్లలే వద్దని చెప్పిన ఆ దేశం ఇప్పుడు ఎంత మంది పిల్లలనైనా కనండని చెబుతోంది. ఎందుకంటే పిల్లలు కనకపోతే ఆ దేశాభివృద్ధి ఆగిపోతుంది. ఏ దేశానికైనా యువతీయువకులే ఆయువుపట్టు. అభివృద్ధికి వారే మూలాధారాలు. యువత ఎంత ఎక్కువగా ఉంటే ఆ దేశం అంత వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ క్రమంలో డింక్ అనే లైఫ్‌స్టైల్ పేరుతో యువతీయువకులు పిల్లలు వద్దంటే ఈ దేశాభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుంది. జననాల రేటు తగ్గిపోయి కొంతకాలానికి ఈ దేశంలో వృద్ధుల సంఖ్య ఎక్కువై పనిచేసే యువత సంఖ్య తక్కువ అవుతుంది. అప్పుడు మళ్లీ పేద దేశంగా మన దేశం మారిపోతుంది. సంతానోత్పత్తి అనేది ప్రకృతి ప్రసాదించిన వరం. సంతానోత్పత్తి లేకుండా ఏ సమాజమూ మనజాలదు. ఇంట్లో, కుటుంబంలో పిల్లలు ఉండటాన్ని తల్లిదండ్రులకే కాదు అమ్మమ్మలు, తాతయ్యలు, బంధువులకు ఎంతో మానసికోల్లాసాన్ని కలిగిస్తుంది.

మార్కెట్‌లో ఒడిదుడుకులే కారణం



సమాజంలో డింక్ లాంటి సంస్కృతులు రావడానికి మార్కెట్‌లోని ఒడిదుడుకులే కారణం. రాష్ట్ర విభజన తర్వాత అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. ప్రభుత్వ ఉద్యోగాలు లేవు. ప్రైవేటు కంపెనీలు లేకపోవడంతో ఉపాధి అవకాశాలు లేవు. ప్రైవేటు ఉద్యోగాలు చేయాలంటే మెట్రోసిటీలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ క్రమంలో మళ్లీ పిల్లలు, వారి బాధ్యతలు అంటూ జీవితాన్ని ఎంజాయ్ చేయలేకపోతామనే భయంతో నేటి యువత ఉన్నారు. ఈ క్రమంలో వారిలో డింక్ లాంటి ఆలోచనలు రావడంలో తప్పేమీలేదు.

– జీఆర్ శర్మ, ఎన్‌హెచ్ఎం ఉద్యోగి, కర్నూలు

వ్యక్తిగత స్వేచ్ఛ కోరుకుంటున్నారు



భార్యాభర్తలిద్దరూ సంపాదిస్తూ పిల్లలు ఇప్పుడే వద్దనే జంటలు ఇటీవల ఎక్కువయ్యారు. దీనికి ఆర్థిక ప్రాధాన్యత కూడా ఒక కారణం. ఆర్థికంగా స్థిరపడటం, వ్యక్తిగత స్వేచ్ఛ కోరుకోవడం ప్రధాన అంశాలు. ఇది ఒక కొత్త జీవనశైలి. దీనికి సామాజిక ఒత్తిడి కూడా ఒక కారణం. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఎక్కువగా ఉండేవి. ఇంట్లో పిల్లలను పెద్దలే ఎక్కువగా చూసుకునేవారు. ఇప్పుడన్నీ చిన్న కుటుంబాలు ఎక్కువగా ఉంటున్నాయి. పిల్లలను కంటే వారి ఆలనాపాలనా చూసేవారు కరువయ్యారు.

– డాక్టర్ ఎం.మల్లికార్జున, అసోసియేట్ ప్రొఫెసర్, పీడియాట్రిక్స్, జీజీహెచ్, కర్నూలు

30 ఏళ్ల తర్వాత పిల్లలను కంటే ఆరోగ్య సమస్యలు



సాధారణంగా 25 నుంచి 30 ఏళ్లలోపు మహిళలు ప్రసవం అయితే వారికి జన్మించే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు. 30 నుంచి 35 ఏళ్ల మధ్య గర్భం దాల్చితే వారికి అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. నెలలు నిండకుండా బిడ్డ జన్మించడం, బీపీ, థైరాయిడ్, షుగర్ వంటివి రావడం జరుగుతాయి. వివాహమైన వెంటనే పిల్లలను కనకూడదన్న ఆలోచన మంచిదే గానీ మరీ ఆలస్యమైతేనే ఇబ్బంది. కొంత మంది ఈ ఇబ్బందులను అధిగమించేందుకు ఎగ్ ఫ్రీజింగ్, సెమన్ ఫ్రీజింగ్ చేసుకుంటున్నారు. దీనివల్ల వారు అనుకున్న వయస్సులో పిల్లలను కనేందుకు వీలు చేసుకుంటున్నారు.

– డాక్టర్ పి.శిరీషారెడ్డి, ఫెర్టిలిటీ స్పెషలిస్టు, కర్నూలు

12,748 కేసులు పరిష్కారం

- జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా జడ్జి కబర్ధి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి

కర్నూలు (లీగల్): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 12,748 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా న్యాయ సేవాధికార అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, కార్యదర్శి జి.లీలా వెంకటశేషాద్రి తెలిపారు. కర్నూలులో 6,211 కేసులు, ఆదోనిలో 1,306, ఆళ్లగడ్డలో 246, ఆత్మకూరులో 126, ఆలూరులో 248, బనగానపల్లెలో 329, డోన్‌లో 419, కోవెలకుంట్లలో 265, నందికొట్కూరులో 310, నంద్యాలలో 1,621, పత్తికొండలో 73, ఎమ్మిగనూరులో 1594 కేసులు పరిష్కారం చేసినట్లు తెలిపారు.

కక్షిదారులకు సత్వర న్యాయమే ధ్యేయం

కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ ధ్యేయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాన న్యాయమూర్తి హాజరై మాట్లాడారు. కాలయాపన లేకుండా కేసులు పరిష్కరించడానికి న్యాయ సేవాధికార చట్టాన్ని రూపొందించారన్నారు. దీని ద్వారా వీలైనన్ని కేసులకు సత్వర పరిష్కారం లభించడంతో పాటు సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. తర్వాత ఫ్యామిలీ కోర్టు జడ్జి భూపాల్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి పాండు రంగారెడ్డి, లోక్ అదాలత్ కార్యదర్శి ఎల్‌వీ శేషాద్రి, జూనియర్ సివిల్ జడ్జీలు సరోజనమ్మ, వందన తదితరులు పలు కేసులకు పరిష్కారం చూపారు. ఇందులో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ఇన్సూరెన్స్, పోలీస్, బ్యాంకు, రెవెన్యూ అధికారులు, పెద్ద సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

పడిపోయిన ఉల్లి ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి ధరలు పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. శనివారం కర్నూలు మార్కెట్‌కు 1,150 క్వింటాళ్ల ఉల్లి వచ్చింది. ఈ నెల 13న కర్నూలు మార్కెట్‌లో గరిష్ట ధర రూ.4,321 లభించింది. సగటు ధర రూ.2,818 నమోదు అయింది. తాజాగా ఉల్లికి కనిష్టంగా రూ.801, గరిష్టంగా రూ.3,609 లభించింది. సగటు ధర రూ.2,229 మాత్రమే నమోదైంది. శుక్రవారం నాటితో పోలిస్తే క్వింటాలుపై రూ.712 పడిపోయింది. కర్నూలు మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారడం వల్ల రూ.1,500 నుంచి రూ.2,000 వరకు మాత్రమే నమోదు అయింది. అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్ల వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను నష్టపరుస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. శనివారం ప్రభుత్వ సెలవు రోజును పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామున పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించి ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. క్యూలైన్లలో వేచిఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు పలు ఏర్పాట్లు చేశారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.

బెదిరింపులు..దౌర్జన్యాలు

- సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ అపహాస్యం
- బరితెగించిన కూటమి నేతలు
- పోలీసుల అండగా ఏకగ్రీవాలు చేసుకున్న వైనం



ఆదోని మండలం సంతెకూడ్లూరులో ఓటేసేందుకు క్యూలో ఉన్న రైతులు



ఎమ్మిగనూరు మండలం పార్లపల్లెలో ఓటర్లును అడ్డుకోవడంతో వెనుదిరుగుతున్న దృశ్యం

కర్నూలు (సిటీ): సాగునీటి సంఘాల ఎన్నికలను కూటమి ప్రభుత్వం అపహాస్యం చేసింది. ప్రజాస్వామ్యబద్ధంగా సాగునీటి వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు నిర్వహించాల్సిన ఎన్నికలను రాజకీయం చేసింది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని తమ పార్టీల కార్యకర్తలకు పదవులు కట్టబెట్టింది. శనివారం జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి నేతలు బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ, కేసీ కెనాల్, హంద్రీనీవా, ఆలూరు బ్రాంచ్ కెనాల్, గాజులదిన్నె ప్రాజెక్టు, చిన్ననీటి పారుదల శాఖ పరిధిలోని చెరువులకు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహిస్తుండటంతో వైఎస్సార్‌సీపీ ఈ ఎన్నికలను బహిష్కరించింది. రైతులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎన్నికల్లో పోటీ చేసేందుకు వెళ్లగా పోలింగ్ కేంద్రాల దగ్గర కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తిష్ట వేసి ముందుగానే తాము నిర్ణయించిన వారిని మాత్రమే ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా చేశారు. కొన్ని చోట్ల పోటీ చేయాలని రైతుల్లో ఆసక్తి ఉన్నా కేంద్రాల దగ్గర గుమికూడి ఉన్న తెలుగు తమ్ముళ్లను చూసి వెనుదిరిగారు. మరికొన్ని చోట్ల పోటీ చేసేందుకు వెళ్లగా నామినేషన్ పత్రాలను లాక్కుని చింపి పంపించేశారు. అడ్డుకోవాల్సిన పోలీసులు చాలా చోట్ల కూటమి నేతలకే పరోక్షంగా మద్దతు ఇచ్చినట్లు తెలుస్తోంది.


అధికార బెదిరింపులతో ఏకగ్రీవం..

సాగునీరు వృథా కాకుండా యాజమాన్య పద్ధతుల ద్వారా చివరి ఆయకట్టుకు నీరందించి మంచి దిగుబడులు పెంచాలన్న లక్ష్యంతో సాగునీటి సంఘాలకు ఏర్పాటు చేశారు. 2014 సంవత్సరం వరకు ఉమ్మడి రాష్ట్రంలో సాధారణ ఎన్నికల తరహాలోనే సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగేవి. విభజన తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన అప్పటి ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం 2018లో ఆ విధానానికి స్వస్తి చెప్పి సంప్రదింపులు, ఏకాభిప్రాయం ముసుగులో తమ పార్టీలకు చెందిన కార్యకర్తలకు పదవులు కట్టబెట్టేలా చట్టాన్ని సవరణ చేశారు. జిల్లాలో 1,32,000 మంది ఆయకట్టుదారులు ఓటర్లుగా ఉన్నారు. ప్రాదేశిక నియోజకవర్గాలు 1,212, నీటి వినియోగదారుల సంఘాలు 123, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 12, ప్రాజెక్టు కమిటీలు రెండు ఉన్నాయి. వీటిలో టీసీలు, నీటి వినియోగదారుల సంఘాలకు శనివారం ఎన్నికలు జరిగాయి. అన్ని చోట్లా కూటమి నేతల కార్యకర్తలకే సంప్రదింపులు, ఏకాభిప్రాయం పేరుతో ఏకగ్రీవం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పలు చోట్ల ఎన్నికలు జరగకుండా పోటీ చేసేందుకు ఆసక్తి చూపిన ఆయకట్టుదారులను బెదిరింపులు, ప్రలోభాలకు గురిచేశారు.

- ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని పార్లపల్లి గ్రామంలోని ఎన్నికల కేంద్రంలో కనీసం ఓటు హక్కు కూడా లేని టీడీపీ నాయకులు ఉన్నారని, తమకు మద్దతుగా వచ్చిన మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు దురుసుగా ప్రవర్తించడగా ఇదేంటి కేంద్రంలో ఉన్న వారిని బయటకు పంపించాలి అని అడిగిన మాజీ ఎమ్మెల్యేతో సీఐ అనుచితంగా ప్రవర్తించారు.
- కోడుమూరు నియోజకవర్గంలోని సి.బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డి గ్రామంలో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన కోట్ల అనుచరులను పోటీ చేయనివ్వకుండా విష్ణువర్ధీయులు అడ్డుకున్నారు. నామినేషన్ వేసేందుకు వెళ్లగా వారి నుంచి నామినేషన్ పత్రాలను సైతం లాక్కుని చింపేశారు. ఇదేంటని ప్రశ్నించిన టీడీపీ గూడూరు మండల అధ్యక్షులు ఎల్.సుధాకర్‌రెడ్డిని బలవంతంగా పోలీసులు జీపులో అక్కడి నుంచి తరలించారు.
- ఆదోని మండలం సాంతకూడ్లూరులో జరిగిన ఎన్నికల్లో చైర్మన్ పదవి కోసం పోటీ పడిన కూటమి నేతలు టాస్ వేసి చైర్మన్‌ను ఎంపిక చేసుకున్నారు.
- పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి మండలం జొన్నగిరి చెరువుకు జరిగిన ఎన్నికల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో టాస్ వేసి అధ్యక్షులను ఎన్నిక చేసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యేపై పోలీసుల దౌర్జన్యం తగదు

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



కర్నూలు (టౌన్): మూడు సార్లు ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా పనిచేసిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎర్రకోట కేశవరెడ్డిపై పోలీసు అధికారుల దౌర్జన్యాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ స్పందించి సదరు పోలీసు అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని పార్లపల్లె సాగునీటి సంఘం ఎన్నికల్లో టీడీపీకి చెందిన వ్యక్తులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్నారు. ఎర్రకోట, కడిమెట్ల, పెద్ద మర్రివీడు గ్రామాలకు సంబంధించిన ఓటర్లందరూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే. వారు ఓటు వేయకుండా తెలుగుదేశం నేతలు పోలీసుల సాయంతో అడ్డుకున్నారన్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేశవ రెడ్డి అక్కడికి వెళ్లి ప్రశ్నిస్తే పోలీసు అధికారులు దురుసుగా ప్రవర్తించడమే కాక దుర్భాషలాడటం విచారకరమన్నారు. అధికారపార్టీ నాయకులకు కొందరు తొత్తులుగా మారారని విమర్శించారు. ఎన్నికలు అంటే ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాలన్నారు. దొంగ ఓట్లతో గెలవాలనుకోవడం సిగ్గుచేటు అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

బాబు హామీలకు దారిద్ర్యం

- పుచ్చకాయలమాడలో అంతర్గత రోడ్లకు గ్రహణం
- రూ.1.38 కోట్లతో 16 అంతర్గత రహదారులకు సీఎం హామీ
- రెండున్నర నెలలకు పూర్తయింది ఐదు రోడ్లు మాత్రమే
- మరో ఐదు రోడ్లకు డ్రైనేజీ పెండింగ్
- నేటికీ ప్రారంభించని ఆరు రోడ్ల పనులు
- అప్రోచ్ రోడ్లకు లభించని పాలనా అనుమతులు


పుచ్చకాయలమాడ గ్రామంలో నిర్మిస్తున్న అంతర్గత రోడ్లు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు జాప్యానికి చిహ్నాలుగా మారుతున్నాయి. ఈ ఏడాది అక్టోబర్ 1న ముఖ్యమంత్రి చంద్రబాబు పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామానికి వచ్చిన సందర్భంలో గ్రామ సర్వతోముఖాభివృద్ధికి పలు హామీలిచ్చారు. ఇందులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.1.38 కోట్లతో గ్రామంలో మూడున్నర కిలోమీటర్ల మేర 16 అంతర్గత రోడ్ల నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది. ఈ రోడ్ల నిర్మాణాలను కూడా ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే సీఎం ఇచ్చిన హామీ మేరకు జరుగుతున్న పనుల్లో కూడా తీవ్ర జాప్యం నెలకొంది. మొత్తం 16 అంతర్గత రోడ్లలో ఇప్పటి వరకు (రెండున్నర నెలల్లో) కేవలం ఐదు రోడ్లు మాత్రమే వంద శాతం పూర్తి అయ్యాయి. మిగిలిన వాటిలో మరో ఐదు రోడ్లకు ఇరు పక్కలా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక ఆరు పనులను నేటికీ ప్రారంభించనేలేదు.

పూర్తయిన ఐదు రోడ్ల పనులు ఇవే..

- రూ.4 లక్షలతో హనుమంతయ్య ఇంటి నుంచి చిన్న వెంకప్ప ఇంటి వరకు
- రూ.4 లక్షలతో బంగారు వెంకన్న ఇంటి నుంచి నారాయణరెడ్డి ఇంటి వరకు
- రూ.10 లక్షలతో కోసిగి రాముడు ఇంటి నుంచి పెద్దబావి వరకు
- రూ.15 లక్షలతో మెయిన్ రోడ్ నుంచి హాస్పిటల్ వరకు
- రూ.4 లక్షలతో రామకృష్ణ ఇంటి నుంచి కొండన్న ఇంటి వరకు
- రూ.20 లక్షలతో చేపట్టిన హైస్కూల్ ప్రహరీ పనులు జరుగుతుండగా, రూ.30 లక్షలతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటి వరకు కేవలం మట్టి పని మాత్రమే జరిగినట్లు తెలుస్తోంది.

రూ.13.20 కోట్ల పనులకు లభించని పాలనా అనుమతులు

పుచ్చకాయలమాడ గ్రామంలో పలు అంతర్గత రోడ్ల నిర్మాణాలతో పాటు ఈ గ్రామం నుంచి సమీప గ్రామాలకు వెళ్లేందుకు రూ.12 కోట్లతో మూడు అప్రోచ్ రోడ్ల పనులు, రూ.90 లక్షలతో గ్రామంలో దర్గా, హిందూ శ్మశానవాటికలకు ప్రహరీల నిర్మాణాలు, రూ.30 లక్షలతో వెటర్నరీ లైవ్ స్టాక్ భవన నిర్మాణానికి నేటికీ ప్రభుత్వం నుంచి పాలనా అనుమతులు లభించలేదు.

నిర్ణీత సమయంలోగా పూర్తి చేస్తాం

పుచ్చకాయలమాడ గ్రామంలో చేపట్టిన అంతర్గత రోడ్ల నిర్మాణాల వేగాన్ని పెంచి నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. ఇందుకు సంబంధించి క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లతో కూడా రెగ్యులర్‌గా మాట్లాడుతున్నాం. పంపిన ప్రతిపాదనలకు సంబంధించి ఇంకా మూడు అప్రోచ్ రోడ్ల పనులతోపాటు రెండు ప్రహరీల నిర్మాణాలు, వెటర్నరీ లైవ్ స్టాక్ భవన నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి పాలనా అనుమతులు రావాల్సి ఉంది. అనుమతులు వచ్చిన వెంటనే పనులను ప్రారంభిస్తాం.

– ఎస్ మద్దన్న, పీఆర్ ఈఈ

క్లుప్తంగా

వక్కెర వాగులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు: కర్నూలు–డోన్ 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన శ్రీచక్ర హాస్పిటల్ వద్ద ప్రవహిస్తున్న వక్కెరవాగు మురికినీటిలో గుర్తు తెలియని వ్యక్తి పడి మృతిచెందాడు. సుమారు 45 ఏళ్ల వయస్సు ఉండి 5.5 అడుగుల ఎత్తు ఉంటాడు. తెలుపు రంగు ఫుల్ షర్టు, నల్లని పూల డిజైన్ కలిగిన బూడిద రంగు స్వెటర్, నీలం కలర్ జీన్స్ ప్యాంట్ ధరించాడు. నీటిలో పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం ఉంది. శరీరం మీద ఎలాంటి గాయాలు లేవు. బహిర్భూమికి వచ్చి లేదా ఇతర కారణాల వల్ల వక్కెర వాగులోని మురికినీటిలో ప్రమాదవశాత్తూ పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. స్థానికుల సమాచారంతో నాల్గవ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

ద్విచక్రవాహనాలకు నిప్పు


ఇంటి ఆవరణలో కాలిపోయిన ద్విచక్రవాహనాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో దూదేకుల మస్తాన్ వలి, హసీనా ఇంటి ఆవరణంలో ఉన్న 3 ద్విచక్రవాహనాలను శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోలు పోసి తగలబెట్టారు. ఇంట్లోకి పొగలు వస్తుండటంతో కుటుంబ సభ్యులు నిద్రలేచి బయటకు రాగా అప్పటికే 3 ద్విచక్రవాహనాలు కలిపోతూ కనిపించాయి. కాగా చుట్టుపక్కల వారి సాయంతో మంటలను ఆర్పివేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి శవమయ్యాడు!


మునిస్వామి మృతదేహం

పాణ్యం: చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగిన యువకుడు శనివారం శవమై తేలాడు. పోలీసు తెలిపిన వివరాలు.. ఆస్పరి మండలం తంగరడోణ గ్రామానికి చెందిన నాగేంద్రప్ప, ఉసేనమ్మ దంపతుల చివరి కుమారుడు మునిస్వామి శుక్రవారం డ్రాప్ కం రెగ్యులేటర్ వద్ద చేపల వేటకు వలతో నీటిలో దిగి గల్లంతయ్యాడు. పోలీసులు, గజ ఈతగాళ్లు శనివారం గాలిస్తుండగా మృతదేహం లభ్యమైంది. పోస్ట్‌మార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కోలుకోలేక యువకుడి మృతి


రాఘవేంద్ర (ఫైల్)

నందికొట్కూరు: స్థానిక బీఆర్‌ఆర్ నగర్‌లోని ఓ ఇంటిలో ఈనెల 9న నిప్పంటుకుని బాలిక మృతి చెందగా తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బోయ ఆకుల రాఘవేంద్ర(20) కోలుకోలేక శనివారం మృతిచెందినట్లు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని యువకుడి స్వగ్రామం వెల్దుర్తి మండలం కలుగొట్లకు కుటుంబీకులు తరలించినట్లు ఆయన చెప్పారు.

పైప్‌లైన్‌కు భారీ గండి



కృష్ణగిరి: హంద్రీనీవా ప్రధాన కాల్వ నుంచి చెరువులకు నీరు మళ్లించే పథకానికి సంబంధించిన పైప్‌లైన్‌కు శనివారం భారీ గండి పడింది. పులిచెర్ల సమీపంలోని డెలివరీ చాంబర్ నుంచి గ్రావిటీ–2 కింద పత్తికొండ వైపు ప్రధాన పైప్ లైన్‌కు ఒకటిన్నర కిటోమీటర్ దూరంలో పులిచెర్ల రైతుల పొలాల్లో జాయింట్ వద్ద గండి పడింది. దీంతో నీరు భారీ ఎత్తున ఎగజిమ్ముతోంది. రైతులు వడ్డే రామకృష్ణ, విజేయుడు కంది పంట పూర్తిగా నీటిలో మునిగిపోయింది. విషయం తెలుసుకున్న హెచ్ఎన్ఎస్ అధికారులు నీటి సరఫరాను నిలిపివేశారు. నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సాక్షి జర్నలిస్టులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి


ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

కర్నూలు(సెంట్రల్): వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం వేముల మండల కేంద్రంలో సాగునీటిసంఘాల ఎన్నికల కవరేజీ కోసం వెళ్లిన సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, సాక్షి పేపర్ రిపోర్టర్ రాజారెడ్డిలపై దాడి చేసినవారిని వెంటనే అరెస్టు చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడికి నిరసనగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఎన్‌టీఆర్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించి గాంధీ విగ్రహానికి వినూత్నంగా వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోరంట్లప్ప, కేబీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రభుత్వం, ప్రజలకు అనుసంధానంగా జర్నలిస్టులు పని చేస్తుంటారని, వారినిపై దాడి జరిగితే ఆందోళనకర పరిస్థితులు నెలకొంటాయన్నారు. జర్నలిస్టులపై తరచూ దాడులు జరుగుతున్నా ప్రభుత్వం ఉదాసీన వైఖరితో పట్టించుకోవడం లేదన్నారు. పులివెందుల నియోజకవర్గంలోని వేములలో కవరేజీకి వెళ్లిన వారిపై విచక్షణరహితంగా దాడి చేయడం అన్యాయమన్నారు. జర్నలిస్టులకు తక్షణమే రక్షణ చట్టాన్ని తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నాగేంద్ర, జిల్లా నాయకులు బసప్ప, మధు, చంద్రశేఖర్, అనిల్, నరసింహ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం


శిలాఫలకాన్ని నేలమట్టం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని నాలుగవ వార్డు కుమ్మరి గేరిలో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు కూల్చేశారు. 2021 సెప్టెంబర్ 7న అప్పటి ప్రభుత్వ నిధులు రూ.7.50 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ కాల్వల నిర్మాణ పనులు చేపట్టేందుకు నగర మేయర్ బీవై రామయ్య, అప్పటి ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, కార్పొరేటర్ ఆర్షియా ఫర్హీన్ కలిసి శిలాఫలకం ఆవిష్కరించారు. కాగా రెండు రోజుల క్రితం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు శిలాఫలకాన్ని కూల్చేశారు. స్థానికుల నుంచి విషయం తెలుసుకున్న కార్పొరేటర్ ఆర్షియా ఫర్హీన్ లిఖిత పూర్వకంగా నగరపాలక కమిషనర్ రవీంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఉద్దేశ పూర్వకంగా కూల్చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఒకటవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారికి ఆమె సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన నాగరాజు

ఆళ్లగడ్డ: కొండపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం అహోబిలంలో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. కర్నూలు జిల్లా దూపాడు గ్రామానికి చెందిన నాగరాజు (48) స్వామిని దర్శించుకునేందుకు ఎగువ అహోబిలం ఆలయానికి చేరుకున్నాడు. దర్శనం అనంతరం ఆలయం ఎదురుగా ఉన్న కొండ మీద నుంచి అందరూ చూస్తుండగానే కిందకు దూకాడు. కింద పడిన నాగరాజు వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గమనించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

రెండు కార్లు ఢీ.. తప్పిన ప్రమాదం


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

గోనెగండ్ల: మండల పరిధిలోని గాజులదిన్నె గ్రామం స్టేజ్ సమీపంలో ఎల్లెల్సీ వద్ద శనివారం రాత్రి రెండు కార్లు ఢీకొన్నాయి. ఆదోని పట్టణానికి చెందిన రాయచోటి సుబ్బయ్య కుటుంబ సభ్యులతో (నలుగురు) కలిసి కర్నూలులో ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు కారులో బయలుదేరారు. కర్నూలుకు చెందిన ఆరుగురు యువకులు ఎమ్మిగనూరులో జరుగుతున్న అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని తిరిగి కర్నూలుకు బయలుదేరారు. గాజులదిన్నె గ్రామం స్టేజ్ సమీపంలోని ఎల్లెల్సీ వద్ద రోడ్డుపై గుంతలు ఉండటంతో రాయచోటి సుబ్బయ్య కారు డ్రైవర్ వేగాన్ని తగ్గించాడు. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన యువకుల కారు ముందు వెళ్తున్న కారు సడన్‌గా స్లో కావడంతో ఢీకొంది. ప్రమాదంలో ముందు వెళ్తున్న కారు పంట పొలాల్లోకి దూసుకెళ్లి ఆగిపోయింది. కాగా ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రెండు కార్లు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదానికి కారణాలపై విచారిస్తున్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహ బంధం

- జాతీయ రహదారిపై బస్సు, బైకు ఢీ
- రోడ్డు ప్రమాదంలో స్నేహితులు దుర్మరణం
- విషాదం నింపిన పుట్టినరోజు వేడుక



బన్నీనాథరెడ్డి, శ్రీకిరణ్(ఫైల్)


ప్రమాదానికి గురైన బైక్

రాజంపేట/కోవెలకుంట్ల: కడప– రేణిగుంట జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు దుర్మరణం చెందారు. పుట్టిన రోజు వేడుక జరుపుకున్న కొద్ది నిమిషాల వ్యవధిలోనే ఇద్దరు యువకులు మృత్యువాత పడటం అందరినీ కలచి వేసింది. వివరాలు ఇలా.. నంద్యాల జిల్లా కోవెలకుంట్లకు చెందిన శ్రీకిరణ్ (20), వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం ఇప్పెంట్ల గ్రామానికి చెందిన బన్నీనాథ్‌రెడ్డి ఉరఫ్ బన్నీ(21) ఇంటర్ చదివే సమయంలో మంచి స్నేహితులు. ప్రస్తుతం బన్నీ చెన్నైలోని సవిత ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్, కిరణ్ రాజంపేట మండలం బోయనపల్లె వద్ద ఉన్న అన్నమాచార్య ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ సెకెండ్ ఇయర్ చదువుతున్నారు. కిరణ్ పుట్టినరోజు కావడంతో శుక్రవారం రాత్రి బన్నీ చెన్నై నుంచి రాజంపేటకు వచ్చాడు. శనివారం పుట్టినరోజు వేడుకను ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం ఇద్దరూ బోయనపల్లె నుంచి బైకులో రాజంపేటకు బయలుదేరారు. మార్గమధ్యంలో కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని బోయనపల్లె వద్ద రాజంపేట నుంచి కడపకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ప్రమాదవశాత్తూ ఢీకొన్నారు. ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వీరి స్నేహం మరణంలో కూడా విడిపోలేదు.

రెండు కుటుంబాల్లో విషాద ఛాయలు

స్నేహితులు కిరణ్, బన్నీలు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన సంఘటన వారి కుటుంబాల్లో విషాద ఛాయలను నింపింది. వీరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఇద్దరు స్నేహితుల మృతి ఘటనను ఇంజినీరింగ్ విద్యార్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మన్నూరు సీఐ ఎస్ఎండీ అలీ తెలిపారు.

చిన్నారిని చిదిమేసిన ట్రాక్టర్

డోన్ రూరల్: మండల పరిధిలోని కొచ్చెర్వు గ్రామంలో శనివారం రాత్రి ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ కింద పడి 15 నెలల చిన్నారి దుర్మరణం చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన విజయ్‌రెడ్డి తన కూతురు 15 నెలలను ఇంటి సమీపంలోని వామిదొడ్డిలో పడుకోబెట్టాడు. అనంతరం ట్రాక్టర్‌ను రివర్స్ కొట్టుందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తూ ముందుకు కదిలి చిన్నారిపై ట్రాక్టర్ దూసుకెళ్లింది. ప్రమాదంలో బాలిక అక్కడికక్కడే ప్రాణాలొదిలింది. కూతురి మృతితో తల్లిదండ్రులు బోరున విలపించారు.

కూతురిని చూడకముందే..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి


గిడ్డయ్య (ఫైల్)

ఆదోని అర్బన్: నెలన్నర క్రితమే జన్మించిన కూతురిని చూసేందుకు బయలుదేరిన ఓ తండ్రి మార్గమధ్యలోనే రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పత్తికొండ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గిడ్డయ్య(32) ఎమ్మిగనూరు మండలం గుడికల్ గ్రామంలో విద్యుత్‌శాఖలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆదోని మండలం నారాయణపురం(పుట్టినిల్లు)లో భార్య రాజేశ్వరి నెల క్రితం పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కూతురు పుట్టిందనే విషయాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులకు చెప్పుకుని సంతోషం వ్యక్తం చేసేవాడు. ఈక్రమంలో కూతురిని చూసేందుకని శనివారం బైక్‌పై బయలుదేరాడు. ఎమ్మిగనూరు దాటిన తర్వాత నారాయణపురం గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతిచెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వీ పోలీసులు తెలిపారు. కాగా కాసేపట్లో ఇంటికి చేరాల్సిన భర్త.. మృతిచెందాడని తెలుసుకుని భార్య గుండెలవిసేలా రోదించిన తీరు పలువురిని కంట తడిపెట్టించింది.